

మన జనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

సంపుటి : 6 | సంచిక : 282 | పేజీలు : 8 | వెల : రూ.2/- | గురువారం 05 నవంబర్ 2026 | వైయస్ఆర్ కడప

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool



నేడే పరిషత్ పోరు..

- పోలింగ్‌కు సర్వం సిద్ధం!

● తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా.. ● 2.61 కోట్ల మంది ఓటర్లు.. 31,460 పోలింగ్ కేంద్రాలు ● గుంటూరు జిల్లాలో మూడు మండలాల్లో వాయిదా.. మిగతా ప్రాంతాల్లో యథావిధిగా పోలింగ్

విజయవాడ,మన జనప్రగతి నవంబర్ 04: మురసు తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణపై నెలకొన్న సందిగ్ధతకు రాష్ట్ర ఎన్నికల సంఘం తెరదించింది. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో నవంబర్ 5న నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పోలింగ్ నిర్వహించాలని నిర్ణయించింది. అయితే ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉన్న గుంటూరు జిల్లాలోని పెదనందిపాడు, ఫిరంగిపురం, కాకుమాను మండలాల్లో ఎన్నికలను తాత్కాలికంగా మిగతా2లో...

వరదలపై చంద్రబాబు హైఅలర్ట్..

అధికారులకు కీలక ఆదేశాలు!

ఏలూరు జిల్లాలో భారీ వర్షాలు, పెద్దవాగు ప్రాజెక్టుకు గండి.. ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశం





అమరావతి,మన జనప్రగతి నవంబర్ 04: ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఏలూరు జిల్లాలో వరద పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించిన ఆయన.. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెద్దవాగు ప్రాజెక్టుకు గండి పడటంపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వేలేరుపాడు మండలంలోని పలు గ్రామాలపై దాని ప్రభావాన్ని సమీక్షించారు. ముంపు ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజలను వెంటనే సురక్షిత మిగతా2లో...

బాల కార్మిక వ్యవస్థకు చెక్..

చట్టం అమలుపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు!


పర్యవేక్షణకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని కేంద్రానికి సూచన.. రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల ద్వారా అమలు చర్యలు



ట్రంప్ ఓటమిపై ప్రపంచ దేశాల స్పందన!

ఇరాన్ హర్షం.. రష్యా ఆచితూచి వ్యాఖ్యలు.. అమెరికాతో సంబంధాలు కొనసాగిస్తామన్న చైనా





పరీక్షల సంస్కరణలపై నందన్ నీలేకనితో చంద్రబాబు చర్చలు

పేపర్ లీకేజీల నివారణకు సాంకేతికత వినియోగంపై దృష్టి

వరద సహాయక చర్యల్లో విషాదం..

11 మంది ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది గల్లంతు!

మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లి బేతపల్లి చెరువు అలుగు వద్ద బోట్లు బోల్తా



సత్తుపల్లి,మన జనప్రగతి నవంబర్ 04: ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతపల్లి పెద్ద చెరువు వద్ద బుధవారం విషాదం చోటుచేసుకుంది. వరదలో చిక్కుకున్న మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లిన 11 మంది ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది రెండు బోట్లు బోల్తా పడటంతో తమ్మిలేరు వాగులో గల్లంతయ్యారు.చెరువు అలుగు వద్ద ఏడుగురు మత్స్యకారులు వరద ఉధృతికి చిక్కుకోగా, వారిని కాపాడేందుకు సిబ్బంది రంగంలోకి దిగారు. గల్లంతైన వారి కోసం అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. కలెక్టర్ దివాకర టీఎస్ మిగతా2లో...



రూ.15 కోట్ల అంతర్జాతీయ క్రిప్టో మోసం ఛేదన..

బాధితురాలికి నగదు తిరిగి ఇప్పించేలా కోర్టు ఆదేశాలు!

టెనాలికి చెందిన మహిళను మోసం చేసిన అంతర్జాతీయ ముఠా గుర్తింపు.. ఎనిమిది మంది నిందితులపై ఛార్జిషీట్

అమరావతి,మన జనప్రగతి నవంబర్ 04: ఆంధ్రప్రదేశ్ సీఐడీ అంతర్జాతీయ క్రిప్టో కరెన్సీ పెట్టుబడి మోసాన్ని ఛేదించింది. అధిక లాభాల ఆశ చూపి టెనాలికి చెందిన ఓ మహిళ నుంచి దాదాపు రూ.15 కోట్లు కాజేసిన ముఠా ఆస్తులను గుర్తించి, బాధితురాలికి తిరిగి ఇప్పించేలా గుంటూరు ప్రత్యేక మిగతా2లో...



గ్లోబల్ సమ్మిట్‌పై కేబినెట్ దృష్టి!

నేడు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రిమండలి సమావేశం

పెట్టుబడులు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ

మద్యం రవాణా కేసులో అంబటి రాంబాబుకు ఈడీ ప్రశ్నల వర్షం!

హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో విచారణ.. ఆర్థిక లావాదేవీలు, టెండర్ల కేటాయింపులపై ఆరా



హైదరాబాద్,మన జనప్రగతి నవంబర్ 04: ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా కుంభకోణం కేసులో వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు మిగతా2లో...



తుపాను బాధితులకు త్వరితగతిన సాయం అందించాలి

- ఏడు జిల్లాల్లో సహాయక చర్యలను వేగవంతం చేయాలి: హోంమంత్రి అనిత

అమరావతి,మన జనప్రగతి నవంబర్ 04: తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలను వేగవంతం చేయాలని హోంమంత్రి వంగలపూడి అనిత జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. సచివాలయంలో బుధవారం మిగతా2లో...

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక

05 - 11 - 2026

వరదలపై చంద్రబాబు హైఅలర్ట్..

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతాలకు తరలించాలని స్పష్టం చేశారు. **గిరిజన ప్రాంతాల్లో భారీ వర్షాలు** ఏలూరు జిల్లాలోని బుట్టాయగూడెం, వేలేరుపాడు, పోలవరం, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం తదితర గిరిజన ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. కొన్ని ప్రాంతాల్లో చిన్న నీటిపారుదల చెరువులు పూర్తిగా నిండి పొంగిపొర్లుతున్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. వర్షాల కారణంగా వాగులు, వంకల్లో వరద ప్రవాహాలు పెరుగుతున్న నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సీఎం సూచించారు. **ఏరియల్ సర్వే అనంతరం సమీక్ష** తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించిన అనంతరం బుధవారం అమరావతిలోని రియల్‌టైమ్ గవర్నెన్స్ సెంటర్ (ఆర్టీజీఎస్) నుంచి ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లాల కలెక్టర్లు హాజరయ్యారు. క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులు, వరద ప్రవాహాలు, సహాయక చర్యల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. **ముంపు ప్రాంతాలను వెంటనే క్లియర్ చేయాలి** భారీ వర్షాలతో వాగులు, కాలువల్లో నీటి ప్రవాహం పెరిగినందున కారంచేడు నుంచి కొత్తపట్నం, చీరాల, చిలకలూరిపేట, పర్చూరు ప్రాంతాల్లోని ముంపు సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని చంద్రబాబు ఆదేశించారు. వరద నీటిని తొలగించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. రహదారులపై రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత జిల్లాల కలెక్టర్లకు స్పష్టం చేశారు. **వాగుల వరద ప్రవాహాలపై ప్రత్యేక నిఘా** రాష్ట్రంలోని వివిధ వాగులు, వంకల్లో పెరుగుతున్న వరద ప్రవాహాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో ఏపీలోని వాగులు, కాలువలకు వరద వచ్చే అవకాశముందని హెచ్చరించారు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో వర్షాల కారణంగా ప్రకాశం బ్యారేజీకి 25,375 క్యూసెక్కుల వరద నీరు చేరినట్లు అధికారులు వివరించారు. నల్లమడ డ్రెయిన్‌కు 47 వేల క్యూసెక్కులు, ఎర్రకాలువకు 19,756 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు తెలిపారు. తమ్మిలేరు, గోనెలవాగుకు 5,500 క్యూసెక్కులు, పెద్దవాగుకు 9,500 క్యూసెక్కుల మేర వరద నీరు చేరుతున్నట్లు వెల్లడించారు. **చెరువులకు గండ్లు పడకుండా ముందస్తు చర్యలు** వరద ప్రవాహాలు పెరుగుతున్న ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండేలా ప్రచారం చేయాలని చంద్రబాబు ఆదేశించారు. చెరువులు, కాలువలకు గండ్లు పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరద ఉధృతి ఉన్న మార్గాల్లో రాకపోకలను పర్యవేక్షించాలని, అవసరమైన చోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. బాధితులకు తక్షణ సహాయం అందేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. **బాధితులకు అండుబాటులో ప్రభుత్వం** వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సహాయక చర్యలను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. బాధితులు తమ సమస్యలను 'మనమిత్ర' యాప్ ద్వారా నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయ సిబ్బందికి తెలియజేయవచ్చని తెలిపారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

నేడే పరిషత్ పోరు..

(మొదటి పేజీ తరువాయి)

వాయిదా వేసింది. **కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష** రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా బుధవారం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో వర్షాల తీవ్రత, రహదారుల పరిస్థితి, పోలింగ్ కేంద్రాలకు చేరుకునే మార్గాలు, ఎన్నికల సిబ్బంది అందుబాటు తదితర అంశాలపై సమీక్షించారు. చాలా జిల్లాల్లో వర్షాలు తగ్గాయని, పోలింగ్ నిర్వహణకు పెద్దగా ఇబ్బందులు లేవని కలెక్టర్లు వివరించారు. క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించిన అనంతరం సాధ్యమైన ప్రాంతాల్లో ఎన్నికలను యథా విధిగా నిర్వహించాలని కమిషనర్ నిర్ణయించారు. **భారీగా ఎన్నికల ఏర్పాట్లు** రాష్ట్రవ్యాప్తంగా 2.61 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందుకోసం 31,460 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ నిర్వహణకు సుమారు 2.52 లక్షల మంది సిబ్బందిని, ఓట్ల లెక్కింపు కోసం 52 వేల మంది సిబ్బందిని నియమించారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేయడంతో పాటు సీసీటీవీ, వీడియో పర్యవేక్షణకు ఏర్పాట్లు చేశారు. **పోలీసు భద్రతపై ప్రత్యేక దృష్టి** పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ముందస్తు భద్రతా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల రద్దీని నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట అదనపు పోలీసు బలగాలను ఏర్పాటు చేయాలని సూచించారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఓటర్లు, ఎన్నికల సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ ఆదేశించారు. **ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల వివరాలు** రాష్ట్రంలో మొత్తం 9,821 ఎంపీటీసీ స్థానాలకు గాను 2,051 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 7,770 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. వీటి కోసం 18,843 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అలాగే జడ్పీటీసీ స్థానాల్లోనూ ఏకగ్రీవమైన స్థానాలను మినహాయించి మిగిలిన స్థానాలకు పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.వర్షాలు తగ్గినప్పటికీ తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. స్థానిక పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

గ్లోబల్ సమ్మిట్‌పై కేబినెట్ దృష్టి!

హైదరాబాద్,మన జనప్రగతి నవంబర్ 04: తెలంగాణ మంత్రిమండలి సమావేశం గురువారం జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సాయంత్రం 4 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఈ సమావేశం నిర్వహించనున్నారు.

అంతకుముందు మధ్యాహ్నం 3 గంటలకు మంత్రులతో సీఎం అనధికా రికంగా సమావేశం కానున్నారు.ప్రధానంగా 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026' ఏర్పాట్లు, రాష్ట్రానికి పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామిక అభివృద్ధిపై చర్చి ంచనున్నట్లు సమాచారం.

వివిధ రంగాల్లో పెట్టుబడి ప్రతిపాదనలు, పరిశ్రమలకు భూకేటాయిం పులు, కొత్త ప్రాజెక్టులకు అనుమతుల అంశాలు కూడా చర్చకు వచ్చే అవకాశం ఉంది.


రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితు లు, వ్యవసాయంపై ప్రభావం, తాగునీరు, విద్యుత్ సరఫరా సమస్యలపైనా మంత్రిమండలి సమీక్షించను న్నట్టు తెలుస్తోంది. రైతుల ఇబ్బందులు, సంక్షేమ పథ కాల అమలు, ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీ, ఉద్యోగ నియామకాలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై చర్చించే అవకాశం ఉంది.వివిధ శాఖల నుంచి వచ్చిన ప్రతిపాదనలు, పరిపాలనాపరమైన అంశాలపై కేబినెట్ నిర్ణయాలు తీసుకోనుంది. సమావేశంలో వెలువడే నిర్ణయాలపై రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.



ట్రంప్‌కు ప్రజల షాక్.. భారత్‌లోనూ మార్పు వస్తుందంటున్న కాంగ్రెస్!

- **అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్ల విజయం.. 'యెస్.. వీ కెన్ టూ' అంటూ కాంగ్రెస్ నేతల్లో కొత్త ఆశలు**

న్యూఢిల్లీ,మన జనప్రగతి నవంబర్ 04:అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి ఎదురుదెబ్బ తగలడం భారత రాజకీయాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. డెమోక్రాట్ల విజయం కాంగ్రెస్ నేతల్లో కొత్త ఆశలు రేకెత్తిస్తోంది. భారత్‌లోనూ రాజకీయ మార్పు సాధ్యమేనంటూ 'యెస్.. వీ కెన్ టూ' (అవును.. మనమూ సాధించగలం) అనే నినాదంతో నేతలు స్పందిస్తున్నారు.నవంబర్ 3న జరిగిన అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు ప్రతినిధుల సభ, సెనేట్ రెండింటిలోనూ మెజారిటీ సాధించారు. ఈ ఫలితాలను ట్రంప్‌కు వ్యతిరేకంగా వచ్చిన ప్రజా తీర్పుగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అభివర్ణించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న 'ఒకే దేశం.. ఒకే ఎన్నిక' విధానాన్ని కూడా ఆయన విమర్శించారు.కాంగ్రెస్ అధికార ప్రతినిధి డాక్టర్ శామా మహమ్మద్ స్పందిస్తూ.. భారత్‌లోనూ త్వరలో ఇలాంటి రాజకీయ మార్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రభుత్వాలకు ప్రజలు ఎన్నికల ద్వారా సమాధానం చెబుతారని పేర్కొన్నారు.



రైతుల సమక్షంలోనే భూముల రీ సర్వే!

- **వచ్చే ఏడాదిలోగా రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూ సర్వే పూర్తి చేయాలి: మంత్రి పొంగులేటి**

హైదరాబాద్,మన జనప్రగతి నవంబర్ 04: రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో వచ్చే ఏడాదిలోగా సమగ్ర భూ సర్వే పూర్తి చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి తెలిపారు. మేడ్చల్–మల్కాజిగిరి కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు.భూముల రీ సర్వేను రైతుల సమక్షంలోనే పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. భూమి హద్దులు, విస్తీర్ణంలో తేడాలు ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రతి భూ యజమానికి పక్కా వివరాలతో కూడిన భూ రికార్డులు, కొత్త పాస్‌బుక్కులు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు.సర్వే జరిగే గ్రామాల్లో తహసీల్దార్లు ప్రతిరోజూ పర్యటించాలని, ఆర్డీవోలు, అదనపు కలెక్టర్లు, కలెక్టర్లు వారానికోసారి క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు.

బాల కార్మిక వ్యవస్థకు చెక్..

న్యూఢిల్లీ,మన జనప్రగతి నవంబర్ 04: బాల కార్మికుల నిషేధ చట్టం అమలును మరింత కఠినతరం చేయాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. బాల కార్మికుల (నిషేధం, నియంత్రణ) సవరణ చట్టం2016 అమలును పర్యవేక్షించేందుకు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల ద్వారా అమలు సంస్థలకు అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖకు సూచించింది.జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టి, జస్టిస్ ఎన్‌వీ అంజారియా ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. 14 ఏళ్లలోపు పిల్లలను అన్ని రకాల వృత్తులు, పనుల్లో నియమించడాన్ని నిషేధించే ఈ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని పేర్కొంది.

2009 నాటి పిటిషన్‌పై విచారణ బాల కార్మికుల చట్టంలోని కొన్ని నిబంధనలను సవాలు చేస్తూ 'హెల్ప్ ఫర్ మిలియన్స్' అనే స్వచ్ఛంద సంస్థ 2009లో పిటిషన్ దాఖలు చేసింది. పిల్లలకు విద్యా సదుపాయాలతో పాటు మధ్యాహ్న భోజనం కల్పించాలని కూడా కోరింది. 2016లో చట్ట సవరణతో పిటిషనర్ లేవనెత్తిన అంశాలు పరిష్కారమయ్యాయని కేంద్రం కోర్టుకు తెలిపింది. దీంతో పిటిషన్‌పై తదుపరి విచారణ అవసరం లేదని పేర్కొన్న ధర్మాసనం, సవరించిన చట్ట నిబంధనలను మాత్రం కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించింది.

వరద సహాయక చర్యల్లో విషాదం..

(మొదటి పేజీ తరువాయి)

ఘటనా స్థలంలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు.**సహాయక చర్యలపై సీఎం ఆరా** ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. గల్లంతైన సిబ్బందిని సురక్షితంగా తీసుకొచ్చేందుకు అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను ఆదేశించారు. పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు సూచించారు.

రూ.15 కోట్ల అంతర్జాతీయ క్రిప్టో మోసం ఛేదన..

(మొదటి పేజీ తరువాయి)

న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది.నిందితుల సూచనలతో బాధితురాలు 13 క్రిప్టో వాలెట్ల ద్వారా బిట్‌కాయిన్, సోలానా, డోజ్‌కాయిన్‌లలో 27 లావాదేవీలు జరిపినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ నిధులను పలు మార్గాల ద్వారా కేమన్ దీవులకు చెందిన గేట్ గ్లోబల్ కార్పొరేషన్ ఎక్స్ఛేంజ్‌కు తరలించినట్లు గుర్తించారు. బ్లాక్‌చైన్ విశ్లేషణతో 15 బిట్‌కాయిన్ లావాదేవీలను గుర్తించి, నాలుగు ఖాతాల్లోని ఆస్తులను స్తంభింపజేశారు.ఈ కేసులో హైదరాబాద్, మహారాష్ట్ర, చైనా, మలేషియా, పోర్చుగల్‌కు చెందిన ఎనిమిది మంది నిందితులను గుర్తించి ఛార్జిషీట్ దాఖలు చేశారు. స్తంభింపజేసిన క్రిప్టో ఆస్తులను ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం యూఎస్‌డీటీగా మార్చి బాధితురాలి ఖాతాకు బదిలీ చేయాలని అక్టోబర్ 30న కోర్టు ఆదేశించింది.

ట్రంప్ ఓటమిపై ప్రపంచ దేశాల స్పందన!

న్యూఢిల్లీ,మన జనప్రగతి నవంబర్ 04:అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ల ఓటమిపై ప్రపంచ దేశాల నేతలు స్పందించారు. డెమోక్రాట్లు విజయం సాధించడాన్ని స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ స్వాగతించారు. ట్రంప్ విధానాలకు అమెరికా ప్రజలు వ్యతిరేకంగా తీర్పునిచ్చారని వ్యాఖ్యానించారు.అమెరికా ఓటర్లు యుద్ధాన్ని తిరస్కరించారని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాఘర్ గాలిబఫ్ పేర్కొన్నారు. మరోవైపు, ఈ ఫలితాలతో అమెరికా విదేశాంగ విధానంలో తక్షణ మార్పులు వస్తాయని భావించలేమని రష్యా తెలిపింది.డెమోక్రాట్ల విజయం ఉక్రెయిన్‌కు మద్దతు, పర్యావరణ పరిరక్షణకు మేలు చేయవచ్చని యూరోపియన్ యూనియన్ నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. అమెరికా ఎన్నికలు ఆ దేశ అంతర్గత వ్యవహారమని చైనా పేర్కొంది. జపాన్, బ్రిటన్ కూడా అమెరికాతో తమ సంబంధాలు కొనసాగుతాయని స్పష్టం చేశాయి.

మద్యం రవాణా కేసులో అంబటి రాంబాబుకు ఈడీ ప్రశ్నల వర్షం!

(మొదటి పేజీ తరువాయి)

హాజరయ్యారు. బుధవారం హైదరాబాద్‌లోని ఈడీ ప్రాంతీయ కార్యాలయానికి చేరుకున్న ఆయనను అధికారులు విచారించారు. కేసుకు సంబంధించి ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేశారు.గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం రవాణా టెండర్ల కేటాయింపుల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. ముఖ్యంగా టెండర్ల కేటాయింపులు, సబ్‌కాంట్రాక్టులు, ఆర్థిక లావాదేవీలు, నిధుల మళ్లింపునకు సంబంధించిన అంశాలపై అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం.గతంలో అనారోగ్య కారణాలతో విచారణకు హాజరుకాలేనని అంబటి ఈడీకి వైద్య నివేదికలు సమర్పించారు. తాజాగా నవంబర్ 4న విచారణకు హాజరుకావాలని అధికారులు మరోసారి నోటీసులు జారీ చేయడంతో ఆయన విచారణకు వచ్చారు.ఈ కేసులో మద్యం రవాణా టెండర్ల ద్వారా ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.195 కోట్ల నష్టం వాటిల్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే పలువురిని అరెస్టు చేసిన ఈడీ.. మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తును కొనసాగిస్తోంది.

తుపాను బాధితులకు త్వరితగతిన సాయం అందించాలి

(మొదటి పేజీ తరువాయి)

కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి సహాయక చర్యలపై సమీక్షించారు.తుపాను ప్రభావిత ఏడు జిల్లాల్లోని 465 గ్రామాల్లో సహాయక చర్యలు ముమ్మరం చేయాలని సూచించారు. బాధితులకు అవసరమైన సాయం సకాలంలో అందేలా చూడాలన్నారు. భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సహకారంతో కేంద్ర బృందాలు త్వరగా రాష్ట్రానికి చేరుకునేలా చర్యలు తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

పరీక్షల సంస్కరణలపై నందన్ నీలేకనితో చంద్రబాబు చర్చలు

- **పేపర్ లీకేజీల నివారణకు సాంకేతికత వినియోగంపై దృష్టి**

అమరావతి, మన జనప్రగతి నవంబర్ 04:

జాతీయ పరీక్షా విధానంలో సమగ్ర సంస్కరణలు తీసుకురావడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పరీక్షల సంస్కరణల ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్ ఛైర్మన్ నందన్ నీలేకని చర్చించారు. రాష్ట్ర సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో పారదర్శకమైన, నమ్మకమైన పరీక్షా విధానం రూపొందించాలని చంద్రబాబు సూచించారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు, సృజనాత్మకత పెంపొందించేలా విద్యా సంస్కరణలు ఉండాలన్నారు. మంత్రి నారా లోకేష్ రాష్ట్రంలో డీఎస్సీ పరీక్షల నిర్వహణలో సాంకేతికత వినియోగాన్ని వివరించారు. పేపర్ లీకేజీల నివారణ, సైబర్ భద్రత, డిజిటల్ ఫోరెన్సిక్స్ బలోపేతంపై దృష్టి సారించినట్లు నీలేకని తెలిపారు.

జెఎన్టీయుఏ సౌత్ జోన్ చెస్ పోటీలకు
ఎంపికైన గౌతమి విద్యార్థిని



ప్రొద్దుటూరు మన జనప్రగతి నవంబర్ 04:- ప్రొద్దుటూరు గౌతమి ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్ మెంట్ ఫర్ ఉమెన్ (అటానమస్) కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న కె అమృత లక్ష్మి ఈఈఈ విద్యార్థిని జెఎన్టీయుఏ సౌత్ జోన్ చెస్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ నెల 9 నుం డి 12 వరకు హైదరాబాద్ లో జరిగే అంతర్ విశ్వవిద్యా లయాల సౌత్ జోన్ చెస్ పోటీలలో ఆమె పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్లు సి. నాగూర్, బి. రవీంద్రా రెడ్డి, కరస్పాం డెంట్ కె.సి. బాబమ్మ, డైరెక్టర్ సి. శైలూష, ప్రిన్సిపాల్ డా. ఎం. రామ సుబ్బమ్మ, ఫిజికల్ డైరెక్టర్ జి. ఓబయ్య మరియు జి. ప్రవల్లిక విద్యా ర్థినిని అభినందించారు.విద్యార్థినులు విద్య తో పాటు క్రీడల్లో కూడా ప్రతిభ కనబరచడం గర్వకారణమని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి కళాశాలకు మం చి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

కూటమి విజయోత్సవ సమావేశం



కడప మన జనప్రగతి నవంబర్ 04:-కడప నగర పాలక సంస్థ ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు ప్రభంజనం సృష్టించి, మేయర్‌గా మల్లి సువర్ణ రికార్డు మెజార్టీతో విజయం సాధించిన సందర్భంగా కడప నగరంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విజయోత్సవ సమీక్షా సమావేశం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కడప శాసనసభ్యురాలు, ప్రభుత్వ విప్ మాధవి మరియు టీడీపీ జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కొత్తగా ఎన్నికైన మేయర్ మల్లి సువర్ణ తో పాటు కార్పొరేటర్లు, కూటమి ముఖ్య నేతలు, శ్రేణులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కడప నగరంలో దశాబ్దాల రాజకీయ చరిత్రను తిరగరాస్తూ ప్రజలు ఇచ్చిన ఈ తీర్పు చారిత్రాత్మకమైనదని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతి డివిజన్‌లోనూ నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేయాలని గెలిచిన ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. కడపను రాష్ట్రంలోనే ఆదర్శ నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎన్నికల్లో రాత్రింబవళ్లు శ్రమించి కూటమి విజయానికి వెన్నెముకగా నిలిచిన ప్రతి కార్యకర్తను, నాయకుడిని ఈసందర్భంగా ప్రశంసించారు.కార్యక్రమం ముగిసిన అనంతరం, విజేతలుగా నిలిచిన ప్రజాప్రతినిధులు మరియు కూటమి ముఖ్య నేతలతో కలిసి క్యాంప్ కార్యాలయంలో ఆత్మీయ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్తగా ఎన్నికైన కార్పొరేటర్లు ఇన్చార్జిలు పాల్గొన్నారు.

చెరువుల వద్ద ఏర్పాట్లను పరిశీలించిన సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం.రమేష్



సైబరాబాద్ మన జనప్రగతి నవంబర్ 04:- తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిపాదిత పర్యటన నేపథ్యంలో, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సున్నం చెరువు మరియు తమ్మిడికుంట చెరువులను స్వయంగా సందర్శించి పరిశీలించారు.ఈ పర్యటనలో కూకట్‌పల్లి జోన్ డి.సి.పి రితిరాజ్, ఐ.పి.ఎస్, మాదాపూర్ డివిజన్ ఎసిపి సిహెచ్. శ్రీధర్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్, పి. రమేష్ మరియు ఇతర ట్రాఫిక్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయా ప్రాంతాలను పరిశీలించిన ఉన్నతాధికారులు, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నిర్వహణ మరియు ఇతర అవసరమైన ఏర్పాట్లను సమీక్షించారు. అన్ని శాఖల మధ్య సరైన సమన్వయం ఉండేలా చూసుకోవాలని, ముఖ్యమంత్రి పర్యటన సజావుగా మరియు సురక్షితంగా సాగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని సంబంధిత పోలీసు సిబ్బందికి మరియు అధికారులకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ తగిన ఆదేశాలు జారీ చేశారు.

తుఫాన్ బాధితులను ఆదుకుంటాం

- పునరావాస కేంద్రంలో బాధిత కుటుంబాలకు మంత్రి కందుల దుర్గేష్ భరోసా



నిడదవోలు, మన జనప్రగతి, నవంబర్ 04:- 'మురసు' తుఫాన్ ప్రభావంతో నిడదవోలు పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో ఇబ్బందులు పడుతున్న 50 కుటుంబాలకు మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించి, బాధితులకు ధైర్యం చెప్పారు. వర్షాలు తగ్గే వరకు పునరావాస కేంద్రంలోనే ఉండాలని, అవసరమైన నిత్యావసర వస్తువులు అందిస్తామని హామీ ఇచ్చారు.గాంధీ బొమ్మ సెంటర్ సమీపంలోని ఆర్ఓబీ కింద ఉన్న దుకాణాల్లోకి వర్షపు నీరు చేరి వ్యాపారుల స్టాక్ దెబ్బతినడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్వీస్ రోడ్డు ఎత్తుగా ఉండటంతో నీరు దుకాణాల్లోకి చేరుతోందని వ్యాపారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ లైటింగ్ సమస్యను కూడా తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.తుఫాన్ వల్ల నష్టపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో చర్చించి త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. వర్షాలు తగ్గిన అనంతరం ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేపడతామని పేర్కొన్నారు.

బీసీల రాజకీయ హక్కులపై రాజీ పడే ప్రసక్తే లేదు: వైసీపీ బిసి నాయకులు

ప్రొద్దుటూరు మన జనప్రగతి నవంబర్ 04:-బీసీలకు దక్కాల్సిన ప్రొద్దుటూరు మున్సిపల్ చైర్మన్ పదవిని ఓసీలకు కేటాయించాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి లేఖ రాశారన్న వివాదంపై బహిరంగంగా నిజానిజాలు నిగ్గు తేల్చాలని వైసీపీ బీసీ నాయకులు డిమాండ్ చేశారు. సంబంధిత లేఖను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపితే వాస్తవాలు వెల్లడవుతా యని పేర్కొన్నారు. బుధవారం దొరసానిపల్లెలోని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి నివాసంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. లేఖ ఫోర్జరీదంటూ టీడీపీ నాయకులు చేస్తున్న వాదనలను వారు ప్రశ్నించారు. లేఖ నిజమైనదని తేలితే కూటమి బీసీ నాయకులు బాధ్యత వహించాలని, ఫోర్జరీ అని నిర్ధారణ అయితే తాము వైసీపీకి రాజీనామా చేసేందుకు సిద్ధమని సవాల్ విసిరారు. కాణిపాకంలో ప్రమాణం చేసేందుకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. బీసీల హక్కుల



విషయంలో పార్టీలకు మద్దతుగా కాకుండా సామాజిక ప్రయోజనాల కోసం నాయకులు స్పందించాలని కోరారు. మాజీ మున్సిపల్ చైర్మన్ భీమునిపల్లె లక్ష్మీదేవి భర్త మాట్లాడుతూ తన భార్య ఐదేళ్లపాటు చైర్మన్‌గా కొనసాగడానికి మాజీ ఎమ్మెల్యే రాచమల్లు సహకరించారని తెలిపారు. కుటుంబ ఆర్థిక ఇబ్బందుల సమయంలోనూ, కుమారుడి వివాహం సందర్భంగానూ ఆయన అండగా నిలిచారని గుర్తుచేశారు. సాధారణ టైలర్ కుటుంబానికి మున్సిపల్ చైర్మన్ పదవి కల్పించిన ఘనత రాచమల్లుదేనని పేర్కొన్నారు. ఆయన తమ కుటుంబ సభ్యుడితో సమానమని అన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు రాజకీయ పదవులతో పాటు విద్య, వైద్య రంగాల్లో ప్రాధాన్యత కల్పించారని నాయకులు పేర్కొన్నారు. నేతన్న నేస్తం, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ, నాడు-నేడు, వైద్య కళాశాలల ఏర్పాటు వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. బీసీలు తమ అతీతంగా ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ శేఖర్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు పిట్టా బాలాజీ, పిట్టా భద్రమ్మ, మెట్టుపల్లె ప్రభాకర్ రెడ్డి, నాయకులు భీమునిపల్లె నాగరాజు, బండారు సూర్యనారాయణ, యాలం శంకర్ పాల్గొన్నారు.

లింగాల జడ్పీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం

19 గ్రామ పంచాయతీల్లో
33 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
ఉదయం 7 నుంచి సాయంత్రం 5
గంటల వరకు పోలింగ్
ప్రశాంత ఎన్నికల నిర్వహణకు 200
మందికి పైగా పోలీసులతో భారీ బందోబస్తు

లింగాల మన జనప్రగతి నవంబర్ 04:రాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా గురువారం జరగనున్న లింగాల జడ్పీటీసీ స్థానానికి ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల పరిధిలోని 19 గ్రామ పంచాయతీల్లో మొత్తం 33 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు మండల ఎన్నికల అధికారి సువాసిని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికల సామగ్రిని అందజేశారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు ఆర్వో సువాసిని వెల్లడించారు. **ఎన్నికల నిర్వహణకు భారీ పోలీసు బందోబస్తు...**లింగాల జడ్పీటీసీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పెద్దమల శ్రీదేవి, తెలుగుదేశం పార్టీ తరఫున వై. సరళాదేవి పోటీలో ఉన్నారు.



మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో ఇరు పార్టీలకు బలమైన కార్యకర్తల బలం ఉండటంతో ఎన్నికల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా ఎస్పీ నచికేతన్ ఆదేశాల మేరకు డీఎస్పీ మురళీ నాయక్, సీఐ శాంతిలాల్ పర్యవేక్షణలో ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక పోలీసులతో పాటు అదనంగా సుమారు 200 మంది పోలీసు సిబ్బంది, పది మంది సీఐలు, ఎస్ఐలను ఎన్నికల విధులకు కేటాయించారు.**గ్రామాల్లో ముందస్తు అవగాహన కార్యక్రమాలు..**ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి తన సిబ్బందితో కలిసి మండలంలోని 19 గ్రామ పంచాయతీల పరిధిలో విస్తృతంగా పర్యటించారు.



గ్రామసభలు, సమావేశాలు నిర్వహిస్తూ ఎన్నికల సమయంలో ఎలాంటి ఘర్షణలు, హింసాత్మక ఘటనలకు పాల్పడవద్దని ప్రజలకు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని భరోసా కల్పించారు. **పోలింగ్ కేంద్రాలకు చేరిన ఎన్నికల సిబ్బంది...** గురువారం జరగనున్న పోలింగ్‌కు సంబంధించి ఎన్నికల సామగ్రితో పాటు విధుల్లో పాల్గొనే సిబ్బందిని బుధవారం రాత్రి పోలీసుల పర్యవేక్షణలో అత్యంత భద్రత మధ్య సంబంధిత పోలింగ్ కేంద్రాలకు తరలించారు. అన్ని కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయడంతో గురువారం ఉదయం పోలింగ్ ప్రారంభం కానుంది. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల యంత్రాంగం, పోలీసు శాఖ సమన్వయంతో చర్యలు చేపట్టాయి.

ఎన్నికల సామగ్రి పంపిణీ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి డా.ఏ.సిరి.




కర్నూలు బ్యూరో మన జనప్రగతి నవంబర్ 04:-ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల విధుల నిర్వహణలో పోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎన్నికల కమిషన్ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.ఏ.సిరి పోలింగ్ సిబ్బందికి సూచించారు.బుధవారం ఎంపీటీసీ,జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి సి. బెళగల్ మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గూడూరు మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, కోడుమూరు మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలో ఎన్నికల సామగ్రి పంపిణీ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, పరిశీలించారు.ఈ సందర్భంగా ఎన్నికల విధులకు



హాజరైన అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలు, నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ పోలింగ్ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. పోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు నిర్ణీత సమయానికి చేరుకునేలా రవాణా ఏర్పాట్లు చేయాలని, బస్సులు, ఇతర వాహనాల ద్వారా సిబ్బంది సకాలంలో గమ్యస్థానాలకు చేరుకునేలా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల విధుల నిర్వహణలో ఏవైనా సమస్యలు ఎదురైనా, ముఖ్యమైన సమాచారం లేదా మార్పులు చోటుచేసుకున్నా వెంటనే కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు కంట్రోల్ రూమ్ సిబ్బంది తక్షణమే స్పందించి, అవసరమైన సమాచారం, సహాయ సహకారాలు అందించాలని స్పష్టం చేశారు. రూట్ ఆఫీసర్లు తమకు కేటాయించిన పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు సమాన దూరం ఉండేలా రూట్‌లను సమన్వయం చేసుకోవాలని, రూట్ ఆఫీసర్లు, సెక్టోరల్ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రక్రియను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, మైనింగ్ శాఖ అధికారి నాగిని, సివిల్ సప్లై డి. ఎం జయంతి, సి. బెలగల్ తహశీల్దార్ వెంకటలక్ష్మి, గూడూరు మండలం తహశీల్దార్ వెంకటేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని గోమాత మృతి

● మాధవరం1 బస్టాండ్ వద్ద రోడ్డు ప్రమాదం..స్థానికుల్లో ఆవేదన



సిద్ధవటం మన జనప్రగతి నవంబర్ 04:-సిద్ధవటం మండలం మాధవరం1 గ్రామంలోని బస్టాండ్ వద్ద బుధవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఉదయం సుమారు 8:30 గంటల సమయంలో గుర్తుతెలియని లారీ గోమాతను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన గోమాత అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన వాహనం ఆగకుండా వెళ్లిపోయినట్లు స్థానికుల ద్వారా తెలిసింది. అనంతరం పారిశుద్ధ్య కార్మికులు మృతి చెందిన గోమాత కళేబరాన్ని అక్కడి నుంచి తొలగించినట్లు సమాచారం. గ్రామంలోని బస్టాండ్ వద్ద జరిగిన ఈ ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేసింది. మూగజీవాల సంరక్షణపై వాహన దారులు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు కోరుతున్నారు.

సుస్థిర జీవనశైలిపై విద్యార్థులకు అవగాహన

● నీటి వనరుల సంరక్షణ,పాదుపుపై ప్రత్యేక కార్యక్రమాలు



సిద్ధవటం మన జనప్రగతి నవంబర్ 4:సుస్థిర జీవనశైలిలో భాగంగా నీటి వనరుల సంరక్షణ, నీటి పొదుపు, సుస్థిర ఆహార వ్యవస్థల ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు సిద్ధవటం ఫారెస్ట్ రేంజ్ అధికారి గుర్రప్ప తెలిపారు. కడప జిల్లా ఫారెస్ట్ అధికారి బాలరాజు ఆదేశాల మేరకు గత నాలుగు రోజులుగా బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాల్లో భాగంగా వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బుధవారం ఆయన వివరించారు. మంగళవారం శ్రీ నలంద పాఠశాల విద్యార్థులను సాహెబ్ బావి రహదారి సమీపంలోని చెక్‌డ్యామ్, ఇంకుడు గుంతల వద్దకు తీసుకెళ్లి నీటి వనరుల సంరక్షణ, పొదుపు, నీటి ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులతో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. అలాగే బుధవారం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కపర్దీశ్వర కోన సమీపంలో సుస్థిర ఆహార వ్యవస్థల ప్రాధాన్యతపై అవగాహన కల్పించి, పర్యావరణ పరిరక్షణలో భాగంగా విత్తన బంతులను చల్లించారు. ప్రకృతి వనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి గుర్రప్ప, డిప్యూటీ రేంజర్ మక్తర్ భాష, సెక్షన్ ఆఫీసర్ సురేష్ బాబు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో కూటమి ప్రభంజనం

● పులివెందులలోనూ వైసీపీకి ఎదురుదెబ్బ : జనసేన సమన్వయకర్త అతికారి కృష్ణ



సిద్ధవటం మన జనప్రగతి నవంబర్ 04:ఉమ్మడి కడప జిల్లాలోని నగరాలు, పట్టణ ప్రాంతాల్లో కూటమి ప్రభంజనం వీచిందని, మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి సొంతగడ్డ పులివెందులలోనూ ఓటర్లు వైసీపీని తిరస్కరించారని జనసేన రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన సిద్ధవటంలోని ఆకుల వీధిలో ఉన్న ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అమలువుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఓటర్లు బ్రహ్మరథం పట్టారని,పట్టణ మరియు స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ,జనసేన,బీజేపీ కూటమి ఘన విజయం సాధించి 'సూపర్ హిట్' కొట్టిందని తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులపై అధికార బలంతో జరిగిన దౌర్జన్యాలను ప్రజా ప్రతినిధులు గుర్తుచేసుకోవాలని,దానికి ప్రజలు ఈ ఎన్నికల ద్వారా తగిన సమాధానం చెప్పారన్నారు.మాజీ సీఎం జగన్ సొంతగడ్డ పులివెందులలోనూ ఎన్నికలు ప్రశాంతంగా జరగడంతో, ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకుని కూటమి పార్టీకి విజయాన్ని అందించారని తెలిపారు. రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ వైకాపాకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బి.ఓబులయ్య, ఏఎంసీ డైరెక్టర్ షేక్ మహబూబ్ బాషా, జనసేన నాయకులు పసుపులేటి గంగయ్య, విజయ్, షేక్ గౌస్ బాషా, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించండి

- గోవిందవాడ ఎంపీటీసీ-1 అభ్యర్థి పి.సోమనాథ్ విజ్ఞప్తి



బొమ్మనహాల్ మన జనప్రగతి నవంబర్ 04:-బొమ్మనహాల్ మండలం గోవిందవాడ గ్రామ ఎంపీటీసీ-1 స్థానానికి తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేస్తున్న తనకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థి పి. సోమనాథ్ గ్రామ ఓటర్లను కోరారు. ప్రజల ఆశీస్సులతో ఎన్నికల బరిలో నిలిచిన తనకు ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలిచి అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ అభివృద్ధికి కృషి చేసేందుకు తనకు అవకాశం కల్పించాలని కోరారు.

నేడు జరగబోయే ఎంపీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం

● 8 పోలింగ్ కేంద్రాలకు 40 మంది సిబ్బంది ఏర్పాటు..

● ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్



సిద్ధవటం మన జనప్రగతి నవంబర్ 04:-మండలంలోని పొన్నవోలు, టక్కోలు ఎంపీటీసీ స్థానాలకు గురువారం జరగనున్న ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి కృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం సిద్ధవటంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రెండు ఎంపీటీసీ స్థానాల పరిధిలో మొత్తం 8 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి ఐదుగురు చొప్పున మొత్తం 40 మంది ఎన్నికల సిబ్బందిని నియమించినట్లు వెల్లడించారు. ఇప్పటికే మూడో విడత శిక్షణ అందించి, పోలింగ్‌కు అవసరమైన సామగ్రిని సిబ్బందికి పంపిణీ చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి కాన్వాయ్ రూట్ అధికారి ఆధ్వర్యంలో పోలీసు ఎస్కార్ట్‌తో ఎన్నికల సిబ్బందిని తరలించినట్లు తెలిపారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ ప్రారంభానికి ముందు అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో ఖాళీ బ్యాలెట్ బాక్సులను చూపించి, వారి సంతకాలు తీసుకున్న అనంతరం బాక్సులకు సీల్ వేసి ఎన్నికల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత బ్యాలెట్ బాక్సులను సీజ్ చేసి, కడపలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా,పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఫణి రాజకుమారి, తహసీల్దార్ విజయకుమార్, ఏవో సోమశేఖర్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీటీసీ ఎన్నికలకు పటిష్ట పోలీసు బందోబస్తు

- పోలింగ్ కేంద్రాల వద్ద 40 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు



సిద్ధవటం మన జనప్రగతి నవంబర్ 04:-మండలంలోని పొన్నవోలు, టక్కోలు ఎంపీటీసీ స్థానాలకు నేడు జరగనున్న ఎన్నికల నేపథ్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సిద్ధవటం ఎస్సై హారిక తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆమె మాట్లాడుతూ రాజంపేట డీఎస్పీ వెంకటరామయ్య ఆదేశాలు, ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు సూచనల మేరకు రెండు ఎంపీటీసీ స్థానాల పరిధిలో మొత్తం 40 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పోలీసు శాఖ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు, ఆయా పార్టీలకు చెందిన అధికారిక ఏజెంట్లు మాత్రమే ఉండాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో అనవసరంగా ఎవరూ గుమిగూడకూడదని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో ఎవరైనా గొడవలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హారిక హెచ్చరించారు. ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆమె కోరారు.

లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి కోటి పరిహారం చెల్లించాలి

● ఉద్యమకారుల యాప్‌ను వెంటనే ప్రారంభించాలి

● గన్ పార్క్ వద్ద టీయూ జేఏసీ ధర్నా



హైదరాబాద్, మన జనప్రగతి, నవంబర్ 04:- తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపిస్తూ తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీయూ జేఏసీ) ఆధ్వర్యంలో బుధవారం గన్ పార్క్ అమరవీరుల స్తూపం వద్ద నిరసన ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా టీయూ జేఏసీ రాష్ట్ర చైర్మన్ సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ, జనగామ జిల్లా కొన్నే గ్రామానికి చెందిన ఉద్యమకారుడు లక్ష్మణ్ గౌడ్ ఆత్మహత్యకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. ఆయన కుటుంబానికి తక్షణమే రూ.కోటి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఉద్యమ కారుల గుర్తింపు, వివరాల నమోదు కోసం 'ఉద్యమకారుల యాప్'ను వెంటనే ప్రారంభించాలని, డిసెంబర్ 9 నాటికి అర్హులైన ఉద్యమకారులకు సంక్షేమ ఫలాలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీయూ జేఏసీ రాష్ట్ర నాయకులు అన్వర్ పటేల్, అనుముల రవీందర్, మోత్కూరు మల్లేష్ తదితరులతో పాటు పలువురు ఉద్యమకారులు పాల్గొన్నారు.

గెలుపోటములు సహజం.. బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

● బాధితులను పరామర్శించిన పులివెందుల మున్సిపల్ కౌన్సిలర్ తోగుట్ల మధుసూదన్ రెడ్డి



పులివెందుల అర్బన్ మన జనప్రగతి నవంబర్ 04:ఎన్నికల్లో గెలుపోటములు సహజమని,ఓటమికి ఎవరూ నిరుత్సాహపడాల్సిన అవసరం లేదని పులివెందుల మున్సిపాలిటీ 33వ వార్డు కౌన్సిలర్ తూగుట్ల మధుసూదన్ రెడ్డి స్పష్టం చేశారు.కష్టకాలంలో బాధిత కుటుంబాలకు తామంతా ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు.పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డుకు చెందిన శివ, 6వ వార్డుకు చెందిన బాలుడు నివాసాలకు బుధవారం తూగుట్ల మధుసూదన్ రెడ్డి వెళ్లారు. వారి కుటుంబ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిసి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం వారికి ధైర్యం చెబుతూ పరామర్శించారు.ఈ సందర్భంగా తూగుట్ల మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ,రాజకీయాలకు అతీతంగా ఆప్యాయత, ఆత్మీయతలతో కలిసికట్టుగా ముందుకు సాగడమే ముఖ్యమని పేర్కొన్నారు. ప్రజాసేవలో గెలుపోటములతో సంబంధం లేకుండా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ,ప్రతి ఒక్కరికీ తోడుగా నిలవడమే తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు.పదవులు, ఎన్నికల ఫలితాలు తాత్కాలికమని, సమాజంలో మనుషుల మధ్య ఉండే ప్రేమానురాగాలు,ఆత్మీయ బంధాలే శాశ్వతమని ఆయన గుర్తుచేశారు.

ఐదు వ్యవస్థల తీరుతోనే ప్రజాస్వామ్యం అపహాస్యం

-ఐదు ప్రభుత్వ వ్యవస్థలపై మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ధ్వజం



ప్రొద్దుటూరు మన జనప్రగతి నవంబర్ 04:-స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాస్వామ్య విలువలు అపహాస్యం పాలయ్యాయని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి విమర్శించారు. బుధవారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు స్వేచ్ఛాయుతంగా ఓటు వేసే అవకాశం లేకుండా అధికార బలంతో కూటమి నాయకులు విజయాలు సాధించారని ఆరోపించారు. ప్రజలు ఆదరించి గెలిపించినప్పుడే విజయోత్సవాలకు అర్థం ఉంటుందని అన్నారు.ఎన్నికల ప్రక్రియలో ప్రతిపక్ష అభ్యర్థులకు అనేక అడ్డంకులు సృష్టించారని, నామినేషన్ పత్రాలు చింపివేయడం, నామినేషన్ల పరిశీలనకు ఆటంకాలు కల్పించడం, అభ్యర్థుల ప్రమేయం లేకుండానే ఉపసంహరణలు చేయించడం వంటి చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. పోలింగ్ సమయంలో దాడులు, దౌర్జన్యాలు, రిగ్గింగ్ చోటుచేసుకున్నాయని విమర్శించారు.ఈ పరిణామాలకు ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం, స్థానిక ఎమ్మెల్యే, పోలీసు వ్యవస్థ, అధికార యంత్రాంగం బాధ్యత వహించాలని రాచమల్లు ఆరోపించారు. ఈ ఐదు వ్యవస్థల సహకారంతోనే కూటమి విజయాలు సాధించిందని ఎద్దేవా చేశారు. 2029లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తిరిగి అధికారంలోకి వస్తేనే ప్రజాస్వామ్యానికి పునరుజ్జీవం కలుగుతుందని తెలిపారు.మున్సిపల్ చైర్మన్ పదవిని బీసీలకు కేటాయించాల్సి ఉండగా, ఓసీలకు ఇవ్వాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి లేఖ రాశారని తాను చేసిన ఆరోపణలను పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. ఆ లేఖపై తన సంతకం లేదని ఎమ్మెల్యే ప్రమాణం చేయాలని, లేదంటే పోలీసులకు ఫిర్యాదు చేసి విచారణకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. లేఖను ఫోరెన్సిక్ ప్రయోగశాలకు పంపించి సంతకం నిజానిజాలను తేల్చాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ శేఖర్ యాదవ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సి.ఎస్. ఖాజామోహిద్దీన్, మాజీ కౌన్సిలర్లు పిట్టా బాలాజీ, పిట్టా భద్రమ్మ, మెట్టుపల్లె ప్రభాకర్ రెడ్డి, నాయకులు భీమునిపల్లె నాగరాజు, బండారు సూర్యనారాయణ, యాలం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు చీరల పంపిణీ యత్నం భగ్నం.. 300 చీరలు,రూ.50 వేల నగదు సీజ్

● మూడు ద్విచక్ర వాహనాలు స్వాధీనం ● మండల సబ్ ఇన్స్పెక్టర్,నబిరసుల్



బొమ్మనహల్ మన జనప్రగతి నవంబర్ 04:-ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ ఓటర్లను ప్రలోభపెట్టేందుకు చీరలు మరియు నగదు తరలిస్తున్న వ్యవహారాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు, ఫ్లయింగ్ స్క్వాడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొమ్మనహల్ మండల పరిధిలో సిద్ధరాంపురం గ్రామ శివార్లలో మండల సబ్ ఇన్స్పెక్టర్ నబీరసూల్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు ఈ తనిఖీల్లో తెలిపిన వివరాలు మేరకు బళ్లారి నుంచి కురువల్లి గ్రామానికి ఓటర్లకు పంపిణీ చేసేందుకు తరలిస్తున్న 300 చీరలను స్వాధీనం చేసుకున్నారు,వీటి విలువ సుమారు రూ.1.20 లక్షలుగా అధికారులు గుర్తించారు,అలాగే వైసీపీ ఎంపీటీసీ అభ్యర్థి గౌరమ్మ భర్త హరికృష్ణ వద్ద నుంచి రూ.50,200 నగదును,మూడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు,ఈ వ్యవహారంలో కురువల్లి గ్రామానికి చెందిన వన్నూర్ అజయ్,పరశురాం, సిద్ధరాంపురం గ్రామానికి చెందిన చిన్న ఆంజనేయతో పాటు అభ్యర్థి భర్త హరికృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు, ఎన్నికల సమయంలో చీరలు, నగదు పంపిణీ చేసి ఓటర్లను ప్రలోభపెట్టడం చట్టరీత్యా నేరమని ఎస్ఐ నబిరసూల్ తెలిపారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేపట్టినట్లు సబ్ ఇన్స్పెక్టర్,నబిరసుల్ వెల్లడించారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన జాయింట్ కలెక్టర్

● 507 పోలింగ్ కేంద్రాల బ్యాలెట్ బాక్సుల స్వీకరణకు పటిష్ట ఏర్పాట్లు

● స్ట్రాంగ్ రూముల వద్ద కట్టుదిట్టమైన భద్రతకు ఆదేశాలు



మదనపల్లి, మన జనప్రగతి, నవంబర్ 04:- ఈ నెల 5న జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సుల స్వీకరణ, భద్రపరిచే ఏర్పాట్లను జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ బుధవారం పరిశీలించారు. మదనపల్లిలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రం, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలను సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణితో కలిసి సందర్శించారు.మదనపల్లి, తంబళ్లపల్లి, పుంగనూరు నియోజకవర్గాల పరిధిలోని 11 మండలాలకు చెందిన 507 పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చే బ్యాలెట్ బాక్సుల స్వీకరణకు మండలాల వారీగా ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించారు. బ్యాలెట్ బాక్సులను నిర్దేశిత స్ట్రాంగ్ రూములకు తరలించడం, భద్రపరచడం, కౌంటింగ్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు.స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతర నిఘాతో పాటు పటిష్టమైన పోలీసు భద్రత ఏర్పాటు చేయాలని, అనధికార వ్యక్తులు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో లక్ష్మీపతి, పంచాయతీరాజ్ ఎస్ఈ విజయశేఖర్, సర్వే శాఖ ఏడీ శాంతరాజ్, డీఎల్డీవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నేపథ్యంలో వేంపల్లిలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

- ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహణకు పటిష్ట భద్రతా చర్యలు



వేంపల్లి, మన జనప్రగతి నవంబర్ 04:- జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో వేంపల్లి పట్టణంలో పోలీసులు బుధవారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు.వేంపల్లి సీఐ నరసింహులు ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది, ఏపీఎస్పీ బలగాలు పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి ప్రజలకు భద్రతపై భరోసా కల్పించారు.ఎన్నికల బందోబస్తులో భాగంగా మొబైల్ పార్టీలు, ప్లైకింగ్ ఫోర్స్, స్పెషల్ ప్లైకింగ్ ఫోర్స్ బృందాలను అప్రమత్తం చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని, ఓటర్లు ఎలాంటి భయం లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

కండక్టర్ ప్రవళిక మృతిపై ఆర్టీసీ ఎన్డబ్ల్యూయూ సంతాపం

● మహిళా ఉద్యోగులకు భద్రత కల్పించాలి

● బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించాలి



హైదరాబాద్, మన జనప్రగతి, నవంబర్ 04:- ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక మృతి పట్ల ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎన్డబ్ల్యూయూ) తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. బుధవారం నారాయణగూడలోని ఐఎన్టీయూసీ భవన్‌లో సంతాప సభ నిర్వహించారు.ఈ సందర్భంగా యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గొడిశాల అబ్రహం మాట్లాడుతూ, విధి నిర్వహణలో ఉండగా ప్రయాణికురాలు కిందకు తోసివేయడంతో తీవ్రంగా గాయపడిన ప్రవళిక పది రోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నవంబర్ 3న మృతి చెందడం బాధాకరమన్నారు. ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విధుల్లో ఉన్న ఆర్టీసీ సిబ్బందికి, ముఖ్యంగా మహిళా ఉద్యోగులకు భద్రత కల్పించాలని, బాధిత కుటుంబానికి యాజమాన్యం ఆర్థిక సహాయం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సయ్యద్ మహమూద్, హనుమంతరావు, చంద్రయ్య, విజయబాబు, ఛాయాదేవి తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సర్వం సిద్ధం

● జిల్లాలో 8.28 లక్షల మంది ఓటర్లు ● 1,002 పోలింగ్ కేంద్రాలు

● నవంబర్ 5న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్



మదనపల్లి, మన జనప్రగతి, నవంబర్ 04:- అన్నమయ్య జిల్లాలో రెండో విడత ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నవంబర్ 5న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు.జిల్లాలో మొత్తం 25 జడ్పీటీసీ స్థానాలకు గాను 22 స్థానాలకు, 321 ఎంపీటీసీ స్థానాలకు గాను 147 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. మొత్తం 8,28,651 మంది ఓటర్ల కోసం 1,002 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించడంతో పాటు భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. జిల్లాలో 294 అతి సమస్యాత్మక, 380 సమస్యాత్మక, 328 సాధారణ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, 674 కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, 328 కేంద్రాల్లో వీడియోగ్రఫీ ద్వారా పర్యవేక్షణ చేపడతామని తెలిపారు.పునఃపోలింగ్ అవసరమైతే నవంబర్ 6న నిర్వహిస్తామని, నవంబర్ 7న ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని వెల్లడించారు. ఇందుకోసం మదనపల్లి, పీలేరు, రాయచోటిలో మూడు కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఎన్నికల నేపథ్యంలో నవంబర్ 3 సాయంత్రం 5 గంటల నుంచి నవంబర్ 5 అర్ధరాత్రి 12 గంటల వరకు డ్రై డే అమల్లో ఉంటుందని, మద్యం దుకాణాలు, బార్లు మూసివేయాలని ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

గ్రామీణ వివాదాలను సామరస్యంగా

పరిష్కరించుకోవాలి

- కమ్యూనిటీ మధ్యవర్తిత్వంపై తుమ్మలపల్లిలో న్యాయ విజ్ఞాన సదస్సు



పులివెందుల, మన జనప్రగతి, నవంబర్ 04:- గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల మధ్య తలెత్తే చిన్నపాటి వివాదాలను పరస్పర చర్చలు, అవగాహన, సయోధ్య ద్వారా సామరస్యంగా పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ సూచించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బుధవారం పులివెందుల మండలం తుమ్మలపల్లిలో కమ్యూనిటీ మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ సమస్యలు, భూ వివాదాలు, ఆస్తి తగాదాలు, ఇతర సామాజిక సమస్యలను కోర్టులకు వెళ్లకుండానే స్థానిక స్థాయిలో కమ్యూనిటీ మధ్యవర్తుల సహకారంతో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. దీనివల్ల సమయం, డబ్బు ఆదా కావడంతో పాటు ప్రజల మధ్య స్నేహపూర్వక సంబంధాలు, సామాజిక ఐక్యత పెరుగుతాయని వివరించారు.శాశ్వత లోక్ అదాలత్, జాతీయ లోక్ అదాలత్ తదితర న్యాయ సేవలపై అవగాహన కల్పించారు. న్యాయ సహాయం కోసం 15100 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. అవసరమైన వారు పులివెందుల మండల న్యాయ సేవా సమితి లేదా కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చన్నారు.ఈ సందర్భంగా శిక్షణ పొందిన కమ్యూనిటీ మధ్యవర్తులు టి. గంగాధర్ రెడ్డి, బి. బయలు రెడ్డి, ఎస్. త్యాగరాజులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పులివెందుల జూనియర్ సివిల్ జడ్జి ఎం. చంద్రశేఖర్ రెడ్డి, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అరుణకుమారి, న్యాయ సేవా సిబ్బంది, శిక్షణ పొందిన మధ్యవర్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ ఆర్.పి. శ్రీనివాసులుకు

శాప్ చైర్మన్ సన్మానం

తిరుపతి, మన జనప్రగతి, నవంబర్ 04:- తిరుపతి నగరపాలక సంస్థ ఎన్నికల్లో 48వ డివిజన్ కార్పొరేటర్‌గా విజయం సాధించిన తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి ఆర్.పి. శ్రీనివాసులును శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు, తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ మైనర్ మహేష్ యాదవ్ బుధవారం కలిసి అభినందించారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని ఆకాంక్షించారు.అనంతరం ఆర్.పి. శ్రీనివాసులు మాట్లాడుతూ, తనను అత్యధిక మెజారిటీతో గెలిపించిన 48వ డివిజన్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పనబాక లక్ష్మి దంపతుల ఆశీస్సులు స్వీకరించిన కార్పొరేటర్ నాగభూషణం



తిరుపతి, మన జనప్రగతి నవంబర్ 04:- తిరుపతి కార్పొరేషన్ ఎన్నికల్లో 16వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్‌గా విజయం సాధించిన ఆర్. నాగభూషణం, టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ముని రామయ్య దంపతులు టీడీపీ తిరుపతి పార్లమెంటు జిల్లా అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, కృష్ణయ్య దంపతులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాలతో సత్కరించి వారి ఆశీస్సులు స్వీకరించారు. పనబాక లక్ష్మి కూడా నాగభూషణం, ముని రామయ్య దంపతులను అభినందించారు.ఈ సందర్భంగా ముని రామయ్య మాట్లాడుతూ, తన సతీమణి నాగభూషణాన్ని కార్పొరేటర్‌గా గెలిపించిన 16వ డివిజన్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఐదేళ్ల పాటు డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం శాప్ చైర్మన్ రవి నాయుడును కలిసి సత్కరించారు.

52వ వార్డులో పృథ్వీ రెడ్డికి ఘన విజయం

- గజమాలతో సత్కరించిన బీజేపీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుబ్బు యాదవ్



తిరుపతి, మన జనప్రగతి నవంబర్ 04:- తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ 52వ వార్డు కార్పొరేటర్‌గా బీజేపీ అభ్యర్థి పృథ్వీ రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఈ సందర్భంగా బీజేపీ తిరుపతి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుబ్బు యాదవ్ ఆయనను గజమాలతో సత్కరించి అభినందించారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ వార్డు అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సద్దా సురేష్ యాదవ్, పొనగంటి భాస్కర్ తదితరులు పాల్గొని పృథ్వీ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. భారీ విజయాన్ని అందించిన 52వ వార్డు ఓటర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

బ్రిక్స్ సుస్థిర జీవనశైలి వారోత్సవాల్లో

ఆరోగ్యంపై అవగాహన

ప్రొద్దుటూరు మన జనప్రగతి నవంబర్ 04:-బ్రిక్స్ సుస్థిర జీవనశైలి2026 వారోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపో గ్యారేజీలోని ఎంఎఫ్ గదిలో డిపో సిబ్బందికి ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ పోషకాహార నిపుణుడు ప్రవీణ్ సిబ్బందికి ఆరోగ్య పరిరక్షణ, పోషకాహారం, ఆరోగ్యకరమైన జీవనశైలిపై పలు సలహాలు, సూచనలు అందించారు. రోజువారీ ఆహారపు అలవాట్లలో తగిన మార్పులు చేసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ గంగాధర్‌తో పాటు డిపో సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షాలు, తుఫాను ప్రభావంతో పంట నష్టం

వెంటనే సర్వే చేసి నష్టపరిహారం చెల్లించాలి: మాజీ ఎమ్మెల్యే సంద్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి, మన జనప్రగతి నవంబర్ 04: నియోజకవర్గంలో కురిసిన భారీ వర్షాలు, మురుసు తుఫాను ప్రభావం కారణంగా రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి పంట నష్టాన్ని ప్రకటించాలని సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సంద్ర వెంకట వీరయ్య విజ్ఞప్తి చేశారు. నవంబర్ 4, 2026 నాటి వర్షపాత నమోదు లెక్కల ప్రకారం సత్తుపల్లి నియోజకవర్గం భారీ వర్షపాతం 200 మి.మీ పైగా నమోదైందనీ అన్నారు.రాష్ట్రంలోనే అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలలో ఇదీ ఒకటిగా నిలిచిందని, దీనివల్ల నియోజకవర్గంలో అపారమైన పంట నష్టం వాటిల్లిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.సత్తుపల్లి నియోజకవర్గంలో ప్రధానంగా వరి సాగు అత్యధిక విస్తీర్ణంలో జరుగుతుంది. ప్రస్తుతం వరి



కోత దశకు వచ్చిన తరుణంలో భారీ వర్షాలకు పొలాలు నీట మునిగి, పంట పూర్తిగా వంగిపోయింది.చేతికి రావాల్సిన పంట నీట మునగడంతో పాటు పొలాల్లో నడుములోతు నీరు నిలిచిపోయింది. ఇప్పటికే ఎల్ నినో ప్రభావంతో సతమత మవుతున్న వరి రైతులకు, ఈ మురుసు తుఫాను మరింత కోలుకోలేని దెబ్బతీసింది అని అన్నారు.వరితో పాటు పత్తి రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారు. తీత దశలో ఉన్న పత్తి వర్షపు నీటిలో తడిచి ముద్దయి దిగుబడి పూర్తిగా దెబ్బతిన్నది. వ్యవసాయ శాఖ యంత్రాంగాన్ని వెంటనే అప్రమత్తం చేసి, సత్తుపల్లి నియోజకవర్గంలో వరి, ఇతర సాగు పంటలకు జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి తక్షణమే సర్వే చేపట్టాలని, సర్వే నివేదికలను వెంటనే ప్రభుత్వానికి పంపి, నియోజకవర్గాన్ని పంట నష్ట ప్రాంతంగా ప్రకటించాలని అన్నారు. అన్నదాతలను ఆదుకునేందుకు ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకుని, నష్టపోయిన ప్రతి రైతుకూ తగిన పంట నష్ట పరిహారాన్ని వెంటనే అందజేయాలని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాజీ శాసనసభ్యులు సంద్ర వెంకట వీరయ్య ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

కార్పొరేషన్ అవినీతిపై చర్యలు తీసుకోవాలి

- బండి సంజయ్ సొంత కార్పొరేటర్లనే హెచ్చరించారు.. అవినీతిని అరికట్టడంలో ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు: వైద్యుల అంజన్ కుమార్

కరీంనగర్, మన జనప్రగతి నవంబర్ 04:కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అవినీతిపై సొంత కార్పొరేటర్లనే కేంద్ర మంత్రి, ఎంపీ బండి సంజయ్ హెచ్చరించడం ఆయన పాలనలోని పరిస్థితిని తెలియజేస్తోందని కాంగ్రెస్ నాయకుడు వైద్యుల అంజన్ కుమార్ విమర్శించారు. కార్పొరేటర్లు అవినీతికి పాల్పడుతున్నారని ఫిర్యాదులు వచ్చాయని, బ్లాక్‌లిస్ట్‌లో పెడతానని బండి సంజయ్ చెప్పినట్లు పత్రికల్లో వచ్చిన కథనాలపై స్పందిస్తూ, అవినీతి జరుగుతున్నట్లు తెలిసినప్పుడు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని, కార్పొరేషన్‌కు నిధులు తీసుకురావడంలోనూ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని ఆరోపించారు. ఇటీవల కలెక్టరేట్



ప్రారంభోత్సవానికి వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నగర సమస్యలు, నిధుల కొరత, ఉద్యోగ ఖాళీలపై వినతిపత్రం అందజేశామని, ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. యూఐడీఎఫ్ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో కేంద్రం వాటా 25 శాతం, రాష్ట్రం వాటా 25 శాతం కాగా, మిగిలిన 50 శాతానికి రాష్ట్ర ప్రభుత్వమే హామీ ఇస్తోందని వివరించారు. గత పాలకవర్గం హయాంలో జరిగినట్లు ఆరోపణలు ఉన్న అవినీతిపైనా, ప్రస్తుత పాలకవర్గంలో జరుగుతున్న అవినీతిపైనా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు మల్లికార్జున రాజేందర్, గంట శ్రీనివాస్, కాంతల జగన్‌రెడ్డి, చారకొండ బుచ్చిరెడ్డి, పడిశెట్టి భూమయ్య, కల్లపల్లి బాలరాజు, సరిల్ల ప్రసాద్, కంకణాల అనిల్, ఇమ్రాన్, సత్తం శ్రీకాంత్, పహాడ్ పెంట శేఖర్, శ్రీకాంత్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వామపక్ష, ప్రజాతంత్ర శక్తుల ఐక్యత దిశగా కీలక ముందడుగు

- నవంబర్ 28 లేదా 30న న్యూఢిల్లీలో జాతీయ ఐక్యతా సదస్సు.. పలు వామపక్ష పార్టీల సానుకూల స్పందన

న్యూఢిల్లీ,మన జనప్రగతి నవంబర్ 04: దేశంలోని వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను ఒకే వేదికపైకి తీసుకువచ్చేందుకు వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యవేదిక చేపట్టిన ప్రయత్నాలకు సానుకూల స్పందన లభించింది. ఐక్యవేదిక కన్వీనర్ జస్టిస్ బి. చంద్రకుమార్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల ప్రతినిధి బృందం నవంబర్ 2, 3 తేదీల్లో న్యూఢిల్లీలో పలు కమ్యూనిస్టు, వామపక్ష పార్టీల జాతీయ నాయకులతో సమావేశమై ఐక్య కార్యాచరణపై చర్చించింది. భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. బేబీ ఈ ప్రయత్నాన్ని స్వాగతిస్తూ, తేదీ ఖరారైన తర్వాత సదస్సులో పాల్గొనేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు–లెనినిస్టు) విముక్తి పార్టీ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య కూడా



సదస్సుకు హాజరయ్యేందుకు అంగీకరించారు. న్యూ డెమోక్రసీ, ఫార్వర్డ్ బ్లాక్, మాస్ లైన్ తదితర వామపక్ష పార్టీల నాయకులు సైతం ఐక్యతా ప్రయత్నానికి మద్దతు తెలిపారు. ఇతర వామపక్ష పార్టీలకు కూడా ప్రతిపాదనలు అందజేయగా సానుకూల స్పందన వచ్చినట్లు ఐక్యవేదిక వెల్లడించింది. రాజ్యాంగ పరిరక్షణ, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, కార్మికుల హక్కుల కోసం కమ్యూనిస్టు, వామపక్ష, అంబేద్కరిస్ట్, బహుజన, మైనారిటీ, సోషలిస్టు, ఇతర ప్రజాతంత్ర శక్తులన్నీ ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొంది. భాగస్వామ్య సంస్థల స్వతంత్ర గుర్తింపును గౌరవిస్తూనే ఉమ్మడి ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేపట్టడమే తమ లక్ష్యమని తెలిపింది. ఈ నేపథ్యంలో 2026 నవంబర్ 28 లేదా 30 తేదీల్లో న్యూఢిల్లీలో జాతీయ ఐక్యతా సదస్సు నిర్వహించాలని ప్రతిపాదించింది. ఈ సదస్సుకు వామపక్ష పార్టీలతో పాటు అంబేద్కరిస్ట్, బహుజన, మైనారిటీ, ప్రజాతంత్ర సంస్థలు, కార్మిక, రైతు, విద్యార్థి, యువజన సంఘాలు, ప్రగతిశీల మేధా వులు, ప్రజాస్వామ్యవాదులు హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేసింది. మతతత్వం, నిరంకుశత్వం, ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడి రాజ్యాంగాన్ని, దేశ భవిష్యత్తును కాపాడాలని పిలుపు నిచ్చింది. ఈ ప్రకటనను ఐక్యవేదిక కన్వీనర్ జస్టిస్ బి. చంద్రకుమార్, సహ కన్వీనర్ ప్రొఫెసర్ వెంకట్ దాస్, కమిటీ సభ్యులు కామ్రేడ్ బొజ్జా భిక్షమయ్య, ప్రొఫెసర్ మొహినొద్దీన్, అధ్యాపకుడు బండారి లక్ష్మయ్య, ప్రొఫెసర్ గొల్ల రమేష్ విడుదల చేశారు.

దీపావళి వేడుకలు ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించాలి

- **బాణసంచా విక్రయాలు, భద్రతా చర్యలపై అధికారుల సమీక్ష**
- **సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ అధ్యక్షతన సమన్వయ సమావేశం**

కల్లూరు, మన జనప్రగతి నవంబర్ 04:దీపావళి పండుగను ప్రజలందరూ ప్రశాంతంగా, సురక్షితంగా జరుపుకునేలా ముందస్తు చర్యలు చేపట్టాలని కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఐఏఎస్ అన్నారు. పండుగ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులతో ఆయన అధ్యక్షతన సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో బాణసంచా విక్రయాలకు అనుమతులు, తాత్కాలిక విక్రయ కేంద్రాల ఏర్పాటు, అగ్నిప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ, విద్యుత్ భద్రత, అత్యవసర వైద్య సేవలపై మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా విక్రయాలు జరగకుండా పర్యవేక్షించాలని, లైసెన్సుదారులు భద్రతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతకు ప్రాధాన్యతనిస్తూ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ పంజాల సర్వయ్య, సత్తుపల్లి సిఐ తుమ్మలపల్లి శ్రీహరి, మండల తాసిల్దారులు కరుణాకర్ రెడ్డి, వీరభద్ర నాయక్, సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.



విద్యార్థుల్లో ఎన్నికలపై అవగాహన పెంపొందించాలి

- **వ్యాసరచన, క్విజ్ పోటీలను పకడ్బందీగా నిర్వహించాలి: కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్**



కల్లూరు, మన జనప్రగతి నవంబర్ 04: విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల ప్రక్రియ, ఓటు హక్కు ప్రాముఖ్యతపై అవగాహన పెంపొందించేందుకు పాఠశాలల్లోని ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ల ఆధ్వర్యంలో వ్యాసరచన, క్విజ్ పోటీలను పకడ్బందీగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులతో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఎన్నికలపై అవగాహన కల్పించడంలో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని పాఠశాలల్లో వ్యాసరచన, క్విజ్ పోటీలను పకడ్బందీ ప్రణాళికతో సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.పోటీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని, పోటీల నిర్వహణ, ప్రచారం, పర్యవేక్షణలో అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.విద్యార్థి దశ నుంచే ఎన్నికలపై సరైన అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా, ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుకైన భాగస్వాములుగా విద్యార్థులను తీర్చిదిద్దవచ్చని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ స్పష్టం చేశారు.

వార్డు సభ్యుల సంఘం మహిళా విభాగం కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పెంచాల కవిత చందు నియామకం



గంగాధర మన జనప్రగతి నవంబర్ 04: కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం మధురానగర్ లో ఈరోజు ఉత్తర్వులు జారీచేసి నియామక పత్రం అందజేసిన వార్డు సభ్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్. వార్డు సభ్యుల సంఘం కరీంనగర్ జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా మధురానగర్ గ్రామ 3వ వార్డు సభ్యులు పెంచాల కవిత చందు ను నియమిస్తూ వార్డు సభ్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ కరీంనగర్ కార్యాలయంలో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వార్డు సభ్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ వార్డు సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా వార్డు సభ్యుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగాలని వార్డు సభ్యుల సంఘం ఇచ్చే పిలుపులలో పాల్గొనాలని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి పబ్బ మహేష్ గౌడ్,కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మూల కరుణాకర్ సంజీవ్, నాయకులు పేరుక గవాస్కర్, పోరండ్ల భూపతి తదితరులు పాల్గొన్నారు.

హాఫీజ్ యూసుఫ్ కుటుంబానికి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ పరామర్శ



కరీంనగర్, మన జనప్రగతి నవంబర్ 04: ఎంఐఎం పార్టీ శాసనసభ్యులు మాజీ హుస్సేన్ కరీంనగర్ పట్టణంలో పర్యటించారు ఎంఐఎం పార్టీ సీనియర్ నాయకుడు శాసహాబ్ మొహల్లకు చెందిన హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ యూసుఫ్ తల్లి అఫ్జలున్నిసా బేగం ఇటీవలే మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఎంఐఎం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ మాజీ కార్పొరేటర్ ఆరిఫ్, ఫసియోద్దీన్ ఖలీద్, అహ్మద్ మొహియుద్దీన్ బాబు జానీ, అబ్దుల్ గఫ్ఫార్, మెరాజోద్దీన్, అబ్దుల్లాఖాన్, షాకిర్ నహ్దీ, ఖమరొద్దీన్ షబ్బీర్ తదితరులు ఉన్నారు.

తేజస్వి యాదవ్‌ను కలిసిన ఐఐపీ తెలంగాణ నాయకులు

- తాజ్ కృష్ణ హోటల్‌లో మర్రి ప్రభాకర్ ముదిరాజ్, చింతల నీలకంఠం ముదిరాజ్ భేటీ

హైదరాబాద్, మన జనప్రగతి నవంబర్ 04:

ఆర్జేడీ జాతీయ అధ్యక్షుడు తేజస్వి యాదవ్‌ను హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో ఐఐపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి ప్రభాకర్ ముదిరాజ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు చింతల నీలకంఠం ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ తరఫున శాలువాతో తేజస్వి యాదవ్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం ఇండియా కూటమిలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ఐఐపీ పార్టీ చేపడుతున్న కార్యక్రమాలు, రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై తేజస్వి యాదవ్ ఆరా తీశారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో పార్టీని విస్తరించడంతో పాటు ఇండియా కూటమిని బలోపేతం చేసేందుకు ఐఐపీ గుప్తా ఆధ్వర్యంలో కృషి చేస్తున్నామని నాయకులు వివరించారు. దీనిపై తేజస్వి యాదవ్ సానుకూలంగా స్పందిస్తూ నాయకుల కృషిని అభినందించారు. రాబోయే రోజుల్లో ఇండియా కూటమి విజయం సాధించి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే దిశగా ముందుకు సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకులు మరింత ఉత్సాహంతో ప్రజల్లోకి వెళ్లి కూటమి బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

జెడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికలకు పటిష్ట భద్రత

● జిల్లా వ్యాప్తంగా 2,155 మంది పోలీసులతో పటిష్ట భద్రత



కర్నూలు బ్యూరో మన జనప్రగతి నవంబర్ 04:- కర్నూలు జిల్లా వ్యాప్తంగా రేపు జరగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని ముందస్తు భద్రతా ఏర్పాట్లను పూర్తి చేసిందని కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ బుధవారం తెలిపారు.ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు, ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీగారు పిలుపునిచ్చారు.జిల్లాలోని కర్నూలు, ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు 4 సబ్ డివిజన్ల పరిధిలలో ఎన్నికలు జరగనున్నాయి.94 అత్యంత సమస్యాత్మక, 162 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లుగా గుర్తించి, ఆయా ప్రాంతాల పరిస్థితులకు అనుగుణంగా భద్రతా చర్యలు చేపట్టామన్నారు. **భద్రతా బలగాల మోహరింపు ప్రత్యేక నిఘా** జిల్లా ఎస్పీ నేతృత్వంలో ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, 7 మంది డీఎస్పీలు, 39 మంది సీఐలు, 61 మంది ఎస్సైలు, 87 మంది ఏఎస్సైలు, 236 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 693 మంది కానిస్టేబుళ్లు, 316 మంది హోంగార్డులతో పాటు 13 ఏపీఎస్పీ ప్లటూన్లు మరియు ఏ ఆర్ పోలీసులు,అటవీ, విజిలెన్స్, ఎక్సైజ్, రైల్వే శాఖల సిబ్బందితో కలిపి మొత్తం 2,155 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

వైసీపీ ఏజెంట్లుగా కూర్చుంటే పీడీ యాక్ట్ నమోదు చేస్తామంటూ పోలీసుల బెదిరింపులు..!

పోలీసుల ఏకపక్ష వైఖరిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం

ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా పోలీసుల వ్యవహారం: పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ



పత్తికొండ మన జనప్రగతి నవంబర్ 04:-వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నికల ఏజెంట్లుగా ఎవరూ కూర్చోకూడదంటూ కృష్ణగిరి పోలీసులు బెదిరింపులకు పాల్పడుతున్నారని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల ఏకపక్ష వైఖరిపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు.కృష్ణగిరి జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో వైసీపీ అభ్యర్థికి వ్యతిరేకంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని ఆమె ఆరోపించారు. వైసీపీ తరఫున ఎన్నికల ఏజెంట్లుగా కూర్చుంటే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని బెదిరిస్తున్నారని, ఏజెంట్లను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి పోలింగ్ రోజు ఉదయం పోలింగ్ సమయానికి స్టేషన్‌కు రావాలని హెచ్చరించడం ఎంతవరకు సమంజసమని విలేకరుల సమావేశంలో ప్రశ్నించారు.ఎన్నికల్లో ఏజెంట్లు లేకుండా పోలింగ్ నిర్వహించాలనుకోవడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు వంటిదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియలో అన్ని రాజకీయ పార్టీలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన పోలీసులు, అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ఒక పార్టీకి అనుకూలంగా, మరో పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.పోలీసులు తమ ఏకపక్ష వైఖరిని విడనాడి నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, వైసీపీ ఎన్నికల ఏజెంట్లను భయభ్రాంతులకు గురిచేసే చర్యలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా దెబ్బతీయాలని చూస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ఇలాంటి చర్యలకు భవిష్యత్తులో తీవ్ర రాజకీయ పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని, 2029 తర్వాత తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని కంగాటి శ్రీదేవమ్మ హెచ్చరించారు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

జడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలి



పత్తికొండ మన జనప్రగతి నవంబర్ 04:- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతోందని కూటమి నాయకులు పేర్కొన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరవేయడంతో పాటు పత్తికొండ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం కావాలంటే స్థానిక సంస్థల్లోనూ కూటమి బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు.రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులందరినీ భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు సంపూర్ణ మద్దతు అందించడం ద్వారా పత్తికొండ నియోజకవర్గ అభివృద్ధికి మరింత బాటలు పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం కూటమి అభ్యర్థులను ఆశీర్వదించి విజయాన్ని అందించాలని సవినయంగా కోరారు.

వైకాపా కార్యకర్తల కోసం ఎంత దూరమైనా వెళ్తాం..!

కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుంది

పోలీసుల ఏకపక్ష వైఖరిపై ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆగ్రహం



లింగాల మన జన ప్రగతి నవంబర్ 04:-వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎలాంటి కష్టం, సమస్య ఎదురైనా అండగా నిలబడి, వారిని కాపాడుకునేందుకు ఎంత దూరమైనా వెళ్తామని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం లింగాల పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఆయన పోలీసు అధికారులతో మాట్లాడారు.లింగాల మండల పరిధిలోని కోమన్నూతల గ్రామానికి చెందిన హేమాద్రి రెడ్డి, పుల్లారెడ్డితో పాటు మరికొందరిని లింగాల ఎస్సై డి. జగదీశ్వర్ రెడ్డి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చినట్లు తెలుసుకున్న ఎంపీ అవినాష్ రెడ్డి, వైకాపా నాయకుడు దుష్యంత్ రెడ్డి హుటాహుటిన స్టేషన్‌కు చేరుకున్నారు. ఆ సమయంలో పులివెందుల రూరల్ సీఐ శాంతిలాల్, ఎస్సై జగదీశ్వర్ రెడ్డి అక్కడ ఉన్నారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులతో ఎంపీ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ వైకాపా కార్యకర్తలను మాత్రమే బైండోవర్ కేసుల పేరుతో పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వానికి చెందిన నాయకులు, కార్యకర్తలను విచారించకుండా వైకాపా కార్యకర్తలను పదేపదే స్టేషన్‌కు పిలిపించి మానసిక క్షోభకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.ఎన్నికల సమయంలో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, అన్ని పార్టీలకు సమానంగా చట్టాన్ని అమలు చేయాలని సూచించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బంది ఎదురైనా పార్టీతో పాటు తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా కోమన్నూతల గ్రామానికి చెందిన ఆరుగురిని విచారించి పంపిస్తామని సీఐ శాంతిలాల్ ఎంపీకి హామీ ఇచ్చారు. దీంతో ఎంపీ అవినాష్ రెడ్డి, దుష్యంత్ రెడ్డి అక్కడి నుంచి పులివెందులకు వెళ్లారు. అనంతరం పోలీసులు విచారణ పూర్తి చేసి కోమన్నూతల గ్రామానికి చెందిన వారిని బుధవారం రాత్రి పంపించారు.

ముస్లింల విద్యా ప్రమాణాలను మెరుగు పరిచేందుకు ఎంఐఎం కృషి

బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ కృషితోనే మైనారిటీ గురుకులాల అంకురార్పణ జరిగింది

సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్ గైడ్స్ పంపిణీలో నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్



మానకొండూర్, మన జనప్రగతి నవంబర్ 04:- తెలంగాణ రాష్ట్రంలో ముస్లింల విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఎంఐఎం పార్టీ విశేషంగా కృషి చేస్తుందని నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ అన్నారు. బుధవారం మానకొండూర్ ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్ 2026 గైడ్స్ ను, ఎస్సెస్సీ చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. 8,9,10వ తరగతి విద్యార్థులకు పెన్నులు, నోట్ బుక్స్ అందజేశారు. సిరిసిల్ల, గంభీరావుపేట, వేములవాడ ఎంఐఎం పార్టీ ప్రతినిధులకు, ఆయా ప్రాంతాల్లో విద్యార్థులకు పంపిణీ చేసేందుకు గైడ్స్ అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ మాట్లాడుతూ.. విద్యార్థులందరూ ముఖ్యంగా బాల, బాలికలు కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, జీవితంలో పదవ తరగతివార్షిక పరీక్ష కీలకమని, ఈ పరీక్షలో ఉత్తీర్ణులు అవ్వడానికి సాలారే మిల్లత్ గైడ్ దోహదపడుతుందని అన్నారు. మాజీ ఎంపీ దివంగత సుల్తాన్ సలావుద్దీన్ ఓవైసీ భవిష్యత్ తరాలకు ఉన్నత విద్యను అందించాలనే సంకల్పంతో గత 26 సంవత్సరాల క్రితం ఆల్ ఇన్ వన్ గైడ్లను ఎంఐఎం పార్టీ తరపున ఉచితంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందజేస్తున్నట్లు, సాలారే మిల్లత్ తర్వాత, తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ, శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీలు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో ఉర్దూను బ్రతికించడం కోసం ఉర్దూ మీడియం పాఠశాలల విద్యా ప్రమాణాలు పెంచడం కోసం, ముస్లింల విద్య అభివృద్ధి కోసం అమోఘమైనటువంటి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్ జిల్లాలో కలిసికట్టుగా అనేకమైనటువంటి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం దారుస్సలాం ఏర్పాటు చేసి, ప్రజా సమస్యల ప్రజల నుండి విజ్ఞప్తులను స్వీకరిస్తూ వారి సమస్యల పరిష్కారానికి దారి చూపడం అభినందనీయమన్నారు. ఎంఐఎం పార్టీ కరీంనగర్ జిల్లా శాఖ చేస్తున్న ప్రజా సేవలను స్ఫూర్తిగా తీసుకొవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ.. తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ, శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీల సారథ్యంలో.. హైదరాబాద్ నగరవ్యాప్తంగా పేద ముస్లింల పిల్లలకు బాసటగా నిలవాలనే సంకల్పంతో కార్పొరేట్ స్థాయిలో 20పాఠశాలలను స్థాపించి, 20వేల మంది విద్యార్థులకు ప్రతి ఏటా విద్యను ఉచితంగా అందిస్తున్నటువంటి ఘనత వీరికి దక్కుతుందన్నారు. ముస్లిం యువత, చెడు వ్యసనాలను మాని, ఉన్నతమైనటువంటి చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి రాజకీయాల్లో రాణించాలని తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ పిలుపునిచ్చారని గుర్తుచేశారు. సాలరే మిల్లత్ గైడ్స్ ను దివంగత సుల్తాన్ సలావుద్దీన్ నాడు భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఈవిద్యా ప్రణాళికను తయారు చేశారని ఆయన గొప్ప సంకల్పంతో నేడు ముస్లింలు క్రీడల్లో, ఉన్నత విద్యలో, సివిల్స్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, గ్రూప్1 వంటి ఉద్యోగాల్లో, డాక్టర్లుగా, ఇంజనీర్లుగా , ఇటు రాజకీయాల్లో రాణిస్తున్నారని చెప్పారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు హఫీజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రీ, అహ్మద్ మొహియుద్దీన్ బాబుజానీ, మాజీ కార్పొరేటర్ ఆరిఫ్, అబ్దుల్ గఫ్ఫార్, మెరాజోద్దీన్, అబ్దుల్లా ఖాన్, ఫసియుద్దీన్ ఖాలీద్, షాకిర్ నహ్ది, సిరిసిల్ల నాయకులు పర్వేజ్, ముస్తఫా, ఇర్ఫాన్ ఖాన్, పాల్గొన్నారు.

జాతీయ సామాజిక భద్రతా బోర్డు సభ్యుడిగా విశ్రాంత ఈపీఎఫ్ కమిషనర్ శ్రీనివాస్ జాలిగం



హైదరాబాద్, మన జనప్రగతి నవంబర్ 04:- కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన లేబర్ కోడ్ల కింద, కేంద్ర కార్మిక మరియు ఉపాధి కల్పన శాఖ మంత్రి అధ్యక్షతన నూతనంగా ఏర్పాటైన 'జాతీయ సామాజిక భద్రతా బోర్డు' సభ్యుడిగా రిటైర్డ్ ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ శ్రీనివాస్ జాలిగం నియమితులయ్యారు. సామాజిక భద్రత, ఈపీఎఫ్ రంగాలు మరియు కార్మిక సంక్షేమ అంశాలలో ఆయనకున్న అపారమైన అనుభవం, నైపుణ్యానికి గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది. శ్రీనివాస్ జాలిగం జాతీయ బోర్డు సభ్యుడిగా ఎంపిక కావడం పట్ల తెలంగాణ ఈపీఎఫ్ పెన్షనర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్. కృష్ణారావు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా బరకత్‌పురలోని అసోసియేషన్ కార్యాలయంలో ఆర్. కృష్ణారావు మాట్లాడుతూ.. సరైన వ్యక్తికి సరైన స్థానంలో అర్హత లభించిందని కొనియాడారు. అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు, వారి సామాజిక భద్రతపై శ్రీనివాస్ జాలిగంకు సుదీర్ఘ అనుభవం, స్పష్టమైన అవగాహన ఉందని తెలిపారు. జాతీయ బోర్డులో ఆయన ప్రాతినిధ్యం వహించడం వల్ల అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి సమర్థవంతంగా తీసుకెళ్లే అవకాశం ఏర్పడుతుందన్నారు. ఇది దేశంలోని లక్షలాది మంది అసంఘటిత కార్మికులకు ఎంతో మేలు చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక

అనుమతులు గోరంత..
కట్టడాలు కొండంత !

ముడుపుల మత్తులో టౌన్ ప్లానింగ్ యంత్రాంగం!

కేపీహెచ్‌బీ 9వ ఫేజ్, ఎంఐజీ 114 లో బరితెగించిన బిల్డర్



కూకట్ పల్లి, మన జనప్రగతి నవంబర్ 04:- నగరంలో చట్టాలు చుట్టాలుగా మారాయి. వ్యవస్థను శాసించాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగం కాసుల కక్కుర్తిలో కూరుకుపోయిందనడానికి కూకట్ పల్లిలో జరుగుతున్న అడ్డగోలు భవన నిర్మాణాలే సజీవ సాక్ష్యం. కేపీహెచ్‌బీ 9వ ఫేజ్, ఎంఐజీ 114 వద్ద ఓ బిల్డర్ మున్సిపల్ చట్టాలను పాతాళానికి తొక్కుతూ నిస్సిగ్గుగా భారీ కట్టడానికి తెరలేపాడు. కాగితాలపై నామమాత్రంగా రెండు అంతస్తులకు మాత్రమే గ్రీన్ సిగ్నల్ తెచ్చుకున్న సదరు ప్రబుద్ధుడు, క్షేత్రస్థాయిలో మాత్రం తనదే రాజ్యం అన్నట్లుగా దర్జాగా అదనపు అంతస్తుల మీద అంతస్తులు పేర్చుకుంటూ పోతున్నాడు.**కంచే చేను మేసిన చందంగా అధికారుల తీరు**నడిబొడ్డున ఇంతటి బహిరంగ చట్టవ్యతిరేక కట్టడం యథేచ్ఛగా సాగుతున్నా, సంబంధిత అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేకపోవడం వారి అవినీతి బాగోతాన్ని బట్టబయలు చేస్తోంది. అక్రమాలను అడ్డుకోవాల్సిన సిబ్బందే, కమీషన్లకు కక్కుర్తిపడి కళ్లు మూసుకున్నారనే తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పై స్థాయి అధికారుల కనుసన్నల్లోనే ఈ తంతు నడుస్తోందా? లేక కింది స్థాయి సిబ్బందే యజమానులను బెదిరించి జేబులు నింపుకుంటున్నారా? అన్నది బహిరంగ రహస్యంగా మారింది.**ప్రజా భద్రత గాలికి...**ఇలాంటి ఇష్టారాజ్యమైన వ్యవహారాలతో ప్రభుత్వ ఖజానాకు గండి పడటమే కాకుండా, భవిష్యత్తులో ప్రజల ప్రాణాలకు పెను ముప్పు పొంచి ఉంది. పరిమితికి మించిన బహుళ అంతస్తుల వల్ల విపరీతమైన భూగర్భ జలాల దోపిడీ జరగడంతో పాటు, ఆ ప్రాంత మౌలిక వసతులపై తీవ్ర ఒత్తిడి పెరిగిపోతోంది. ప్రజా భద్రతను గాలికి వదిలేసి, లంచాల మత్తులో తూగుతున్న టౌన్ ప్లానింగ్ సిబ్బందిపైనా, రూల్స్ బేఖాతరు చేసిన సదరు నిర్మాణదారుడిపైనా తక్షణం క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కూకట్ పల్లి వాసులు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతా ధికారులు ఇకనైనా నిద్రలేచి, ఎంఐజీ 114 వద్ద సాగుతున్న ఈ అడ్డగోలు భవనాన్ని సీజ్ చేసి చట్టం ఇంకా బతికే ఉందని నిరూపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అయ్యప్ప ఆలయంలో ఘనంగా విశేష పూజలు,అన్నదానం

● నియమనిష్టలతోనే స్వామివారి అనుగ్రహం ● గురుస్వామి వెంకట్రామిరెడ్డి ● శరణుఘోషతో మార్మోగిన ఆలయ ప్రాంగణం



పులివెందుల అర్బన్ మన జనప్రగతి నవంబర్ 04: స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం పురస్కరించుకుని స్వామివారికి విశేష పూజలు, పంచామృతాభిషేకాలు మరియు అన్నదాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.గురుస్వామి వెంకటరామిరెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు పుష్పేంద్ర గౌతమ్ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి.ఉదయం నుంచే స్వామివారికి పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామార్చనలు పూర్తి చేసి,ప్రత్యేక పుష్పాలంకారంలో అయ్యప్ప స్వామిని దర్శనార్థం కొలువుదీర్చారు.ఈ సందర్భంగా భక్తుల శరణుఘోషతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభతో మార్మోగింది.మండల పరిధిలోని పలు గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో మాలాధారణ చేశారు.ఈ సందర్భంగా గురుస్వామి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ అయ్యప్ప దీక్షా కాలంలో కఠిన నియమాలను నిబద్ధతతో, భక్తిశ్రద్ధలతో పాటించినప్పుడే స్వామివారి సంపూర్ణ అనుగ్రహం లభిస్తుందని పేర్కొన్నారు.అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు మధ్యాహ్నం మహా అన్నదానం,రాత్రి వేళల్లో అల్పాహార ప్రసాద వితరణ చేపట్టారు.ఈ వేడుకల్లో మండల నలుమూలల నుంచి అయ్యప్ప భక్తులు, మహిళలు,యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం

21 మండలాల్లో 599 పోలింగ్ కేంద్రాలు

5.94 లక్షల మంది ఓటర్లు

16 జడ్పీటీసీ, 55 ఎంపీటీసీ స్థానాలకు 242 మంది అభ్యర్థులు పోటీ



కడప, మన జనప్రగతి, నవంబర్ 04:- వైఎస్సార్ కడప జిల్లాలో నవంబర్ 5న నిర్వహించనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 21 మండలాల పరిధిలో 16 జడ్పీటీసీ, 55 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.జిల్లావ్యాప్తంగా 599 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, జడ్పీటీసీ పరిధిలో 4,47,809 మంది, ఎంపీటీసీ పరిధిలో 1,46,290 మంది కలిపి మొత్తం 5,94,099 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు. జడ్పీటీసీ స్థానాలకు 71 మంది, ఎంపీటీసీ స్థానాలకు 171 మంది కలిపి మొత్తం 242 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని పేర్కొన్నారు.పోలింగ్ నిర్వహణకు 2,995 మంది సిబ్బందిని నియమించడంతో పాటు అవసరమైన పోలింగ్ సామగ్రిని కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. జిల్లాలో 134 సున్నిత, 167 అత్యంత సున్నిత, 5 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టామన్నారు.పోలింగ్ అనంతరం బ్యాలెట్ పెట్టెల భద్రత, ఓట్ల లెక్కింపు కోసం బద్వేలు, జమ్మలమడుగు, కడప, పులివెందుల, రాజంపేట డివిజన్లలో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఓటర్లు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

ఎయిడ్స్ నియంత్రణ లక్ష్యాలను వందశాతం సాధించాలి

- జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్. రవి బాబు



కడప, మన జనప్రగతి, నవంబర్ 04:- జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణకు నిర్దేశించిన లక్ష్యాలను వందశాతం సాధించాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్. రవి బాబు, క్లస్టర్ ప్రోగ్రామ్ అధికారి వేంపల్లి భాస్కర్ సూచించారు.బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో దిశ ఆధ్వర్యంలో జిల్లా కమ్యూనిటీ రిసోర్స్ గ్రూప్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హైరిస్క్ ప్రాంతాల్లో హెచ్ఐవీ పరీక్షల శిబిరాలు నిర్వహించాలని, డిసెంబర్ 1న ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ కార్యక్రమాలను సమన్వయంతో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఎయిడ్స్ సురక్ష కార్యక్రమంలో భాగంగా మూడు 95 లక్ష్యాలను సాధించాలని, సోచ్ పోర్టల్‌లో కేసులను నమోదు చేయాలని సూచించారు. హెచ్ఐవీ పాజిటివ్‌గా నిర్ధారణైన వారికి ఏఆర్టీ కేంద్రాల ద్వారా చికిత్స అందించాలని, ప్రతి గర్భిణికి హెచ్ఐవీ పరీక్ష తప్పనిసరిగా నిర్వహించాలని తెలిపారు. ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు, కౌన్సెలింగ్, మందుల సరఫరాలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో జిల్లా సూపర్వైజర్ ప్రసాద్, ప్రివెన్షన్ ఆఫీసర్ ఆనంద్ కుమార్, ఐసీటీసీ కౌన్సిలర్లు, ఏఆర్టీ సిబ్బంది, ఎన్జీవో ప్రతినిధులు, సీఎస్ఎస్ ఆఫీసర్ గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 163 అమలు

- జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారి డా. ఏ.సిరి



కర్నూలు బ్యూరో మన జనప్రగతి నవంబర్ 04:-జడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడంతో పాటు శాంతిభద్రతలను పరిరక్షించేందుకు జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బి ఎన్ ఎస్ ఎస్) సెక్షన్ 163 (గతంలో సి ఆర్ పి సి సెక్షన్ 144) కింద నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారి డా.ఏ.సిరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా,పోలింగ్ కేంద్రాల వద్ద క్రమశిక్షణ,శాంతిభద్రతలు కొనసాగించే ఉద్దేశంతో ఈ ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ ఆదేశాల ప్రకారం ప్రతి పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల పరిధిలో నలుగురు కంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమిగూడటం నిషేధమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే విధంగా వ్యవహరించడం, గుంపులుగా చేరడం వంటి చర్యలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఉండదన్నారు.ఎన్నికల నిబంధనలు, నిషేధాజ్ఞలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

సగర కులాన్ని బీసీ-ఎలో చేర్చాలి

- మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేత



హైదరాబాద్, మన జనప్రగతి, నవంబర్ 04:-సగర (ఉప్పర) కులాన్ని బీసీ-డీ నుంచి బీసీ-ఎలోకి మార్చాలని తెలంగాణ సగర హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీరడి భూపేష్ సాగర్ కోరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సగర ఫెడరేషన్‌కు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, నిర్మాణ కార్మికులకు రూ. 10 లక్షల ప్రమాద బీమా, యువతకు ఉపాధి రుణాలు, ప్రభుత్వ పదవుల్లో ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సగర నాయకులు పాల్గొన్నారు.

మురసు తుఫాన్‌తో 162.841 కి.మీ. మేర దెబ్బతిన్న రహదారులు

● మరమ్మతులకు రూ.143.36 కోట్లు అవసరం

● రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



అమరావతి, మన జనప్రగతి, నవంబర్ 04:- మురసు తుఫాన్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా 162.841 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయని, రెండు చోట్ల స్క్రార్స్, నాలుగు చోట్ల రోడ్డు కోతలు, ఐదు కల్వర్టులు దెబ్బతిన్నట్లు వెల్లడించారు. తుఫాన్‌కు నేలకూలిన 201 చెట్లను తొలగించగా, 73 ప్రాంతాల్లో ఏర్పడిన ట్రాఫిక్ అంతరాయాల్లో ఇప్పటికే 34 చోట్ల రాకపోకలను పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు. జిల్లాల వారీగా నెల్లూరులో 66.600 కి.మీ., ఎన్టీఆర్ జిల్లాలో 52.683 కి.మీ., పశ్చిమ గోదావరిలో 38.572 కి.మీ., ప్రకాశంలో 3.600 కి.మీ., పల్నాడులో 1.386 కి.మీ. రహదారులు దెబ్బతిన్నాయని తెలిపారు.రహదారుల తాత్కాలిక మరమ్మతులకు రూ.16.66 కోట్లు, శాశ్వత మరమ్మతులకు రూ.126.70 కోట్లు కలిపి మొత్తం రూ.143.36 కోట్లు అవసరమని ప్రాథమికంగా అంచనా వేసినట్లు మంత్రి వివరించారు. ప్రజలకు రవాణా ఇబ్బందులు కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, మరమ్మతులను వేగవంతం చేసి రహదారులపై రాకపోకలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని ఆదేశించారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174